సాక్షి ఆదిలాబాద్

గురువారం । 22 । ఆగస్టు । 2024



కొనసాగుతున్న జూడాల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ రిమ్స్ జూడాల నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.



కార్యదర్శులతో డీఎల్పీవోల చర్చలు

జీపీ కార్యదర్శులు సామూహిక సమ్మెబాట పట్టనుండడంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం వారితో చర్చలు జరిపారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా జితేందర్‌రెడ్డి బాధ్యతలు



బాధ్యతలను స్వీకరిస్తున్న జితేందర్ రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జెడ్పీ సీఈవోగా గోపిడి జితేందర్‌రెడ్డి నియామకమయ్యారు. ఇదివరకు సీఈవోగా పనిచేసిన రత్నమాల గత నెల 31న పదవీ విరమణ పొందారు. దీంతో ఆ పోస్టులో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసుకుని తిరిగి మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు వచ్చిన జిల్లాలోని తాంసి మండలానికి చెందిన జితేందర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారాంచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇది వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా, ఆదిలాబాద్ ఎంపీడీవోగాను సేవలందించారు. అనంతరం జిల్లాలోని ఎంపీడీవోలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా మండలాలకు సంబంధించిన ప్రగతి, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

రైతు ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి అన్నం పెట్టే రైతులకు సున్నం పెట్టారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీకి సంబంధించి 40 శాతం మంది రైతులకు కూడా ప్రయోజనం దక్కలేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట గురువారం ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు మెట్టు ప్రహ్లాద్, రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు బదిలీ ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీ ప్రక్రియ చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తూ కుటుంబానికి దూరంగా ఉన్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. సొంత జిల్లాలకు, వారికి సమీపంలోని మండలాలకు వెళ్లేందుకు అధికారులకు గోడు వెల్లబోసుకున్నప్పటికీ పరిష్కారం లభించలేదు. ఎట్టకేలకు విద్యాశాఖ వీరిని బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 17 కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీ, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లకు బదిలీ చేసేందుకు ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ..

బదిలీ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా చేపట్టనున్నారు. 2024 ఆగస్టు 1 నాటికి రెండేళ్లు పూర్తి చేసుకొని ఒక కేజీబీవీలో పనిచేస్తున్న వారు బదిలీ కోసం అర్హులని ప్రకటించారు. ఈ ప్రక్రియ కొత్త జిల్లాల ప్రాతిపదికన చేపట్టనున్నారు. ఈనెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 5న బదిలీకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. schoo ledu. telangana. gov.in/isms ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత తెలిపారు. మార్గదర్శకాలకు సంబంధించి deoadbd. weeblyలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

ఓవర్ టు గ్రీవెన్స్



ఇచ్చోడ రైతు వేదికలో నోడల్ అధికారికి దరఖాస్తులు అందజేస్తున్న రైతులు



ఇతడి పేరు కాటిపెల్లి వినోద్‌రెడ్డి. తలమడుగు మండల కేంద్రానికి చెందిన రైతు. ఇక్కడి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచిలో రూ.1లక్ష 31వేల రుణం ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో రూ.78వేలు మాత్రమే మాఫీ జరిగింది. ఇతనొక్కడే కాదు.. ఈ బ్యాంకులో ఖాతా ఉన్న అనేక మంది రైతులదీ ఇదే పరిస్థితి.

- రుణమాఫీ కాలేదంటూ రైతుల ఫిర్యాదులు
- నోడల్ అధికారులకు దరఖాస్తుల అందజేత
- 'మహారాష్ట్ర బ్యాంకు' అన్నదాతలవే అధికం

సాక్షి,ఆదిలాబాద్: రుణమాఫీ కాలేదంటూ ఇప్పటికే వందలాది మంది రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌ను ఆశ్రయిస్తున్నారు.. నోడల్ అధికారులను కలిసి వివరాలు అందజేస్తున్నారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 19న ప్రతీ మండలంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం, ఎంఏవో, ఎంఈవోలను నోడల్ అధికారులుగా నియమించిన విషయం తెలిసిందే. ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు స్వయంగా అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. 30 రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆ రోజు ప్రకటన కూడా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గ్రీవెన్స్‌ను ఆశ్రయిస్తున్న రైతులు రుణమాఫీపై ఆశాభావంతో ఉన్నారు.

ఈ అంశాల్లో..

ప్రధానంగా రైతు వేదికల్లో ప్రస్తుతం రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తుండగా, ఇందులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు సంబంధించిన రైతులవే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బ్యాంకులో ఉన్న రుణం కంటే తక్కువ మొత్తంలో మాఫీ అయినట్లు అనేక మంది రైతులు అధికారులను ఆశ్రయించి చెబుతున్నారు. కాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో మొదటి విడతకు సంబంధించి జాబితా పంపినప్పుడు రైతు రుణంకు సంబంధించి డాటా సరిగా పంపించకపోవడంతో పలువురు రైతులకు ఉన్న రుణం కంటే అతి తక్కువ రుణం మాఫీ అయిందని చెబుతున్నారు. ఆ తర్వాత ఆ సమస్యను గుర్తించి మరో జాబితాను మూడో విడత కంటే ముందు పంపించినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇక ఇతరత్రా ఫిర్యాదులకు సంబంధించి నోడల్ అధికారులు నోట్ చేసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో రైతు రుణమాఫీకి సంబంధించి మొదటి, రెండో, మూడో విడతలు కలిపి మొత్తం 55,961 మంది రైతులకు సంబంధించి రూ.608.88 కోట్ల మాఫీ జరిగింది. రూ.2లక్షల లోపు రుణం ఉన్న రైతులకు మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో పలు కారణాలతో వందలాది మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. దీంతో ఆయా మండలాల్లో అన్నదాతలు ఆందోళనలు చేపట్టారు. ప్రతిపక్షాలు సైతం అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దంటూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తూ వస్తోంది. ఇప్పటివరకు వందలాది ఫిర్యాదులు అందాయి. ఇదిలా ఉంటే సీఎల్‌డబ్ల్యూపోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ ప్రస్తుతం రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లోనే ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో నమోదు ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

700కు పైగా ఫిర్యాదులు..



ఈనెల 19 నుంచి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌కు ఇప్పటివరకు అన్ని మండలాలు కలిపి 700కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనే నమోదు చేస్తున్నాం. బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్తున్నాం. అన్నివిధాలా రైతుల ఫిర్యాదుపై స్పందించడం జరుగుతుంది.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పల్లె పోరుకు సన్నద్ధం

- పంచాయతీ ఓటరు జాబితాపై ఎస్‌ఈసీ దృష్టి
- ప్రత్యేక షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 6 నుంచి సవరణ ప్రక్రియ



ఇటీవల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ) దృష్టి సారించింది. ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ జిల్లా పంచాయితీ అధికారులకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక షెడ్యూల్ ఖరారు చేసింది. వచ్చే నెల 6 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభించి 21న పంచాయతీల్లోని వార్డుల వారీగా తుది జాబితా ప్రకటించాలని ఆదేశించింది. అయితే ఈ జాబితాను ఏ విధంగా రూపకల్పన చేయాలనే దానిపై ఈ నెల 12న జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ఐదుగురు మాస్టర్ ట్రైనర్లు వీరికి అవగాహన కల్పించారు. అయితే ప్రస్తుతం రోజుకో మండల పంచాయతీ కార్యదర్శులు నిరసన బాట పడుతుండటంతో ఈ ప్రక్రియ ఏ విధంగా సాగుతుందనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగానే..

అసెంబ్లీ ఓటర్ల జాబితా అనుసరించి ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రకటించిన జాబితా ఆధారంగానే పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈసీ ఆదేశించింది. ఎంపీడీవోలు, ఎంపీవోలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఫొటోలతో కూడిన జాబితాలను సిద్ధం చేసే ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. 01.01.2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్చనున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, ఉట్నూర్‌లలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీవోలకు ప్రత్యేక శిక్షణ కూడా అందించారు.

ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్..

- వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో సెప్టెంబర్ 6న ప్రకటించాలి
- 9న అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులతోజిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, 10న మండల స్థాయిల్లో ఎంపీడీవోలు సమావేశాలునిర్వహించి సిద్ధం చేసిన జాబితాలను అందజేయాలి.
- వార్డులు, గ్రామాల వారీగా సిద్ధం చేసిన జాబితాలపై సెప్టెంబర్ 7నుంచి 13 వరకు అభ్యంతరాలను స్వీకరించాలి.
- గ్రామాలు, వార్డుల వారీగా అందిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి 19వ తేదీన పరిష్కరించాలి.
- జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో సిద్ధమైన ఓటర్ల తుది జాబితాలను 21న ప్రకటించాలి.

'ఎల్‌ఆర్‌ఎస్' పకడ్బందీగా చేపట్టాలి

- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన
- అధికారులకు కలెక్టర్ రాజర్షిషా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్న పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన గురువారం నుంచి షురూ కానుంది. ఈ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించాలనే దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. తొలుత దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వేనంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులను అనవసర ఇబ్బందులకు గురిచేయకూడదని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే వారికి సమాచారం అందించాలన్నారు. తద్వారా నిర్ణీత సమయానికి వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా ప్లాట్లు ప్రైవేట్ స్థలమా లేక ప్రభుత్వ స్థలమా అనేదాన్ని పక్కాగా నిర్ధారించుకోవాలన్నారు. బఫర్ జోన్ కండీషన్లు, మాస్టర్ ప్లాన్ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీవో శ్రీలత, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రుణమాఫీకి దూరం

- ఓ రైతు గతంలో రుణం చెల్లించినా.. చెల్లించలేదని ప్రభుత్వానికి నివేదిక
- ఆందోళనలో బాధితుడు



PRIMARY AGRICULTURE
CO-OPERATIVE SOCIETY, LTD.BOATH.
Regd, No. 5909
Mdl. Boath, Dist, Adilabad.

తప్పిదం జరిగిందని పీఏసీఎస్ అధికారులిచ్చిన లెటర్

బోథ్: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ రైతు రుణమాఫీకి దూరమయ్యాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన సింధె శివాజీ అనే రైతు గ్రామంలో తనకున్న వ్యవసాయ భూమి ఆధారంగా బోథ్ ప్రాథమిక సహకార సంఘంలో గతంలో రుణం తీసుకున్నాడు. ఆ రుణాన్ని 2017 అక్టోబర్ 31న పూర్తిగా చెల్లించాడు. అయితే శివాజీకి నిర్మల్ జిల్లా కుంటాల మండలంలో కూడా వ్యవసాయ భూమి ఉంది. దీంతో కుంటాలోని యూనియన్ బ్యాంకులో గతంలో రూ.లక్ష 93 వేల రుణం తీసుకున్నాడు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేపట్టగా మూడో విడతలో భాగంగా తన రుణం కూడా మాఫీ అవుతుందని ఆశతో ఎదురుచూశాడు. అయితే మాఫీ కాలేదు. దీనికి కారణం బోథ్ పీఏసీఎస్ అధికారులని తేలింది. గతంలో తాను తీసుకున్న రుణం 2017లోనే చెల్లించినా.. పీఏసీఎస్ అధికారుల రుణం చెల్లించలేదని ప్రభుత్వానికి నివేదించారు. దీంతో పీఏసీఎస్‌లో ఉన్న రుణంతో పాటు కుంటాలలో తీసుకున్న రుణం కలిపి రూ.2,51,658 శివాజీ పేరిట ఉండిపోయింది. రుణం రూ.2లక్షలు దాటడంతో మాఫీ కాలేదని తెలిసింది. తమ తప్పు గమనించిన అధికారులు పీఏసీఎస్‌లో శివాజీకి ఎలాంటి రుణం లేదని నోడ్యూ సర్టిఫికెట్ అందించారు. కాగా, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు అధికారులను కోరుతున్నాడు.

బంద్ ప్రశాంతం



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బుధవారం భారత్ బంద్‌కు పిలుపునివ్వగా జిల్లాకేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. సమితి నాయకులు తొలుత పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన కూడళ్ల గుండా బైక్ ర్యాలీ చేపట్టారు. తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. వర్గీకరణను ఎత్తివేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఇందులో సమితి కన్వీనర్ మ్యాకల మల్లన్న, కోకన్వీనర్లు రత్నజాడే ప్రజ్ఞాకుమార్, భీంరావ్ వాఘ్మారే, విఠల్, కుష్‌వర్త లాండ్గే, ఉజ్వల, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బదిలీ

- ఇద్దరు ఏడీఏలు కూడా..
- ఆదిలాబాద్ డీఏవోగా ఉషారాణి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారిగా ఉన్న పుల్లయ్య ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన ఆదిలాబాద్ ఏడీఏగా పనిచేస్తూ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయనతో పాటు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న రమేశ్ జయశంకర్ భూపాలపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే ఎస్టీఎల్‌లో ఏడీఏగా పనిచేస్తున్న ప్రసాద్‌కు మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఏడీఏగా స్థానచలనం కలిగింది. కాగా ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు ఏడీఏలకు బదిలీలు జరగగా, వీరి స్థానంలో జిల్లాకు ఎవరు రాలేదు. ఇదిలా ఉండగా వరంగల్ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న ఉషారాణి బదిలీపై జిల్లాకు రానున్నారు. కొన్నేళ్లుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉండగా.. ఎట్టకేలకు భర్తీ అయింది.

ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా..?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్



హాజరైన ఆయా శాఖల అధికారులు

- అధ్వానంగా జాతీయ రహదారి
- మరమ్మతులు చేపట్టకపోతే కేసులు పెట్టిస్తాం
- సోమ కంపెనీకి ఎంపీ హెచ్చరిక
- రుణమాఫీపై రైతులకు స్పష్టత ఇవ్వాలి
- 'దిశ' సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టకపోతే కేసులు పెట్టాల్సి వస్తోంది.. ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడ వరకు ఎన్నో గుంతలు ఏర్పడ్డాయి.. రోడ్డంతా అధ్వానంగా మారింది.. తరచూ ప్ర మాదాలు చోటు చేసుకుంటున్నాయి.. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.. జిల్లా కేంద్రం నుంచి బెంగళూర్ వరకు ఉన్న జాతీయ రహదారి లో కేవలం సోమ కంపెనీ నిర్వహణ రోడ్డే అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేపట్టకపోతే చర్యలు చేపడతాని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ఆ కంపెనీ నిర్వాహకులు, జాతీయ రహదారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం (దిశ) ఎంపీ నగేశ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని మాట్లాడారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేపట్టాలి: ఎంపీ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి లబ్ధి పొందేలా చూడాలని ఎంపీ నగేశ్ అన్నారు. అలాగే రుణమాఫీకి సంబంధించి రైతుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడలో 648 మంది రైతులకు సంబంధించి మహారాష్ట్ర బ్యాంకులో రుణాలు తీసుకుంటే కేవలం 47 మందికి మాత్రమే మాఫీ వర్తించిందని తెలిపా రు. మరో రైతు రూ.1లక్ష 40వేల రుణం తీసుకుంటే కేవలం రూ.70వేలు మాత్రమే జమ అయ్యాయని పేర్కొన్నారు. 40శాతం మందికి మాత్రమే మాఫీ జరిగిందని, మిగితా రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కొంత మంది అధికారులకు అవగాహన లేక రైతుల సందేహాలు నివృత్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. వారికి అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. యూనిఫాంల పరిస్థితిపై ఆరా తీశారు.

ఖానాపూర్ చెరువును కబ్జా నుంచి కాపాడాలి..

ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువును కబ్జా కోరల్లో నుంచి కాపాడాలని కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే శంకర్ కోరారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మరో400 మందిని అదనంగా కేటాయించాలని సూచించారు. అలాగే ప్రభుత్వమే టెండర్ల ద్వారా ఇసుకను విక్రయించేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీటిని నిర్మల్ జిల్లా అధికారులు మళ్లిస్తున్నారని, ఈవిషయంలో చొరవ చూపాలన్నారు. కొరటా–చనాఖా ద్వారా పైపులైన్లు వేసి నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. పట్టణంలో కొంత మంది రైస్‌మిల్లుల యజమానులు వడ్లను మహారాష్ట్రకు తరలించి అక్రమాలకు పాల్ప డుతున్నారని పేర్కొన్నారు. విచారణ జరిపించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీడీఎస్ ద్వారా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతగా ఉండడం లేదని, నాసిరక భోజనం వండిపెడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో పనిచేసేందుకు ఉపాధ్యాయులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో సర్కారు బడుల్లో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. రిమ్స్‌లో మరిన్ని డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేసి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న వైద్యపోస్టులు భర్తీచేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా,మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డీఆర్డీవో సాయన్న, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, రిమ్స్‌డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలపై పట్టింపేది?

- 17 ఏళ్లయినా 'పొరుగు' సేవల్లోనే..
- చాలీచాలని జీతాలతో సతమతం
- గోడు పట్టించుకోని ప్రభుత్వాలు
- ఈనెల 23 నుంచి సమ్మెబాటలో..



నర్సాపూర్ సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర

నిర్మల్‌ఖిల్లా: రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఆరోగ్యమిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. 17 సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ప్రభుత్వాలు వీరిని పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా స్పందనలేకపోవడంతో ఈనెల 23వ తేదీ నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, సచివాలయ ఉన్నతాధికారులకు ఇప్పటికే సమ్మె నోటీసు అందజేశారు.

ఉమ్మడి జిల్లాలో 76 మంది..

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 76 మంది ఆరోగ్యమిత్రలు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 22 మంది, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 19, నిర్మల్‌లో 19, మంచిర్యాల జిల్లాలో 16 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో రోగి చేరిన నుంచి డిశ్చార్జి అయ్యేదాకా వైద్యసేవల విషయంలో ఆరోగ్యమిత్రలే కీలకంగా వ్యవహరిస్తారు. వీరు సమ్మెకు దిగితే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో..

2007లో ఆరోగ్యశ్రీ స్కీంను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 900 మంది ఆరోగ్యమిత్రలను నియమించింది. ఉమ్మడి జిల్లాలో 76 మంది వరకు పనిచేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వీరికి నెలకు రూ.18వేల వేతనం ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటి నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. గతంలో వేతనాలు పెంచుతామని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ యాజమాన్యం హామీ ఇచ్చినా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాలేదు. దీంతో చాలీచాలని వేతనాలతోనే పనిచేస్తూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోయినా కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలు తీరుతాయని ఆరోగ్యమిత్రలు భావిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర నాయకులు గత డిసెంబర్ 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనరసింహ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ సీఈవోను కూడా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఇప్పటివరకు వీరి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

డిమాండ్లు ఇవే..

- ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలి. జీవో నంబర్ 60 ప్రకారం రూ.22,750 వేతనం చెల్లించాలి.
- వేతనాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలి.
- రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ.35వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలి.
- షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలి.
- 17 ఏళ్ల నుంచి పీహెచ్‌సీల్లో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి వాటిలోనే నియమించాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలి.
- విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డ్ సౌకర్యం కల్పించాలి.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



నేను 17 సంవత్సరాల నుంచి ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న. మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.22,750కు పెంచాలి. మా వేతనాలను నేరుగా ట్రస్టు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా కాకుండా కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగులుగానైనా గుర్తించాలి.

– కొటిక శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర, నిర్మల్ జనరల్ ఆస్పత్రి

పదహారేళ్లుగా పనిచేస్తున్నాం



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 17 సంవత్సరాలుగా పని చేస్తున్నాం. చాలీచాలని వేతనాలు, ఉద్యోగభద్రత లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యలు పరిష్కరించాలని గతంలో అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదు.

– సంగీత, ఆరోగ్యమిత్ర, భైంసా ఏరియాస్పత్రి

క్లుప్తంగా

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య


వివరాలు సేకరిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

కడెం: జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూర్‌కు చెందిన మంగళి (గడ్డం) రాజన్న (70)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురుకు వివాహమైన కొన్నేళ్లకే విడాకులై ఇంటి వద్ద ఉంటూ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. ఈనెల 20న ఖానాపూర్‌లో ఉండే తన తమ్ముడు రాములు వద్దకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పిన రాజన్న తిరిగి రాలేదు. బంధువులు ఆచూకీ కోసం గాలించగా ఈనెల 21న ధర్మాజీపేట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య భూదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. 30 ఏళ్లుగా మండల కేంద్రంలో హేర్‌కటింగ్ షాపు నిర్వహిస్తూ అందరితో కలుపుగోలుగా మెదిలిన రాజన్న అకాల మరణంపై స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మండలంలోని భూతాయి (బీ) గ్రామపంచాయతీ పరిధి కొలాంగూడ గ్రామానికి చెందిన కుమ్ర రాజు (40) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల తన పొలం వద్ద కుమ్ర రాజుకు కాలు విరిగింది. దీంతో కాలుకు శస్త్రచికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఆస్పత్రి ఖర్చులు ఎక్కువ కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. బుధవారం ఉదయం భార్య లక్ష్మీబాయి పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మోడలింగ్‌లో మెరిసిన ఆదిలాబాద్ యువకుడు


సాయికుమార్

ఆదిలాబాద్‌టౌన్: మిస్టర్ టీన్–2024 ఫైనల్ పోటీలకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎం.సాయికుమార్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను ఢిల్లీలో నిర్వహించారు. ఏటా అలీ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని సాయికుమార్ తెలిపారు. సెమీ ఫైనల్‌లో ప్రతిభ కనబర్చి అక్టోబర్ 18న జరిగే ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. డిగ్రీ పూర్తి చేసిన తాను ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 271 మంది పోటీల్లో పాల్గొనగా, 50 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. తెలంగాణ నుంచి ముగ్గురు పాల్గొనగా, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన తాను ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎస్ఎంఎస్ ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారని, విజేతల పేర్లను లిమ్కా బుక్‌ఆఫ్ రికార్డ్‌లో నమోదు చేస్తారని తెలిపారు. విజేతలను వివిధ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తారని పేర్కొన్నారు. ఈయన ఫైనల్ పోటీలకు ఎంపిక కావడంపై కాలనీవాసులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక సెలవుల్లో పంచాయతీ కార్యదర్శులు


ఎంపీడీవో లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఇచ్చోడ: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులు పెట్టారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో లక్ష్మణ్‌ను కలిసి నాలుగురోజుల పాటు సామూహిక సెలవులు పెడుతున్నట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నార్నూర్ పంచాయతీ కార్యదర్శి దినేశ్ సస్పెన్షన్‌కు నిరసనగా సాముహిక సెలవులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలో గత ఫిబ్రవరి నుంచి పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా సొంత డబ్బులతో పనులు చేయిస్తూ గ్రామాలాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి తమకు ఎలాంటి సహకారం అందకపోగా సస్పెన్షన్‌కు గురిచేస్తూ, మెమోలు ఇస్తూ తమను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. నార్నూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ తమను తీవ్రంగా కలిచివేసినట్లు తెలిపారు. దీంతో నాలుగు రోజులపాటు సామూహిక సెలవులు పెడుతున్నట్లు పేర్కొన్నారు.

సెలవుల విరమణ

బజార్‌హత్నూర్: నార్నూర్ పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, అతనికి మద్దతుగా మండలానికి చెందిన 30 మంది పంచాయతీ కార్యదర్శులు నాలుగు రోజులు సామూహిక సెలవులు మంజూరు చేయాలని బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే నార్నూర్ ఎంపీవో, డీఎల్పీవోల ద్వారా సస్పెన్షన్‌ను ఎత్తివేస్తామని హామీ ఇవ్వడంతో సామూహిక సెలవులు విరమించినట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

ఆర్జీయూకేటీ ఉద్యోగులకు శిక్షణ


శిక్షణకు హాజరైన ఆర్జీయూకేటీ ఉద్యోగులు

బాసర: బాసర ఆర్జీయూకేటీ ఉద్యోగులకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌లో ఉత్తమ పద్ధతులు' అంశంపై మూడురోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఎంసీహెచ్ ఆర్డీ, చీఫ్ సెక్రటరీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ సహకారంతో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ చొరవతో పరిపాలన విభాగంలో నిర్వర్తించాల్సిన విధులపై శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కాలేజ్ ఎట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ప్రొఫెసర్ మజూర్ హుస్సేన్ వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. పాలన నాయకత్వం, యూనివర్సిటీ పాలనాపరమైన అంశాలను తుదిరూపు ఇవ్వడం, సమర్థవంతమైన బోర్డు నిర్వహణ కమ్యూనికేషన్, వ్యూహాత్మక ప్రణాళిక అమలు విధానాల గురించి వివరించారు. బడ్జెట్, ఆర్థిక ప్రణాళిక, వనరుల కేటాయింపు ఆప్టిమైజేషన్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్ సమ్మతి తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు హరికృష్ణ, రాజు, శ్రీనివాస్ మిట్టపల్లి, ఇమామ్, చిన్నారెడ్డి, దస్తగిరి సతీశ్ రాయల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి


ఎస్పీతో మాట్లాడుతున్న బాధితుడు

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఆర్టీసీ కండక్టర్ సయ్యద్ పర్వేజ్ బుధవారం ఎస్పీని కలిశాడు. తనకు జరిగిన మోసం గురించి వివరించాడు. ఈనెల 10న క్రెడిట్ కార్డ్ లిమిట్‌ను పెంచుతామని సైబర్ మోసగాడు తనకు ఫోన్ చేసినట్లు తెలిపాడు. తన కార్డు లిమిట్‌ను రూ.లక్ష పెంచుతానని చెప్పడంతో పాటు ఇందుకు రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుందని నమ్మించాడని పేర్కొన్నాడు. క్రెడిట్‌కార్డు, సీవీవీ నంబర్ తెలుసుకుని ఖాతా నుంచి రూ.34వేలు మాయం చేసినట్లు వాపోయాడు. తాను మోసపోయినట్లు బాధితుడు గ్రహించి సైబర్‌క్రైమ్‌ను సంప్రదించాడు. బాధితుడు పోగొట్టుకున్న డబ్బుల ఖాతాను తాత్కాలికంగా నిలిపివేసి డబ్బులు వచ్చేలా కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల మాయమాటలకు ఎవరూ మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. వారు పోగొట్టుకున్న డబ్బులను తిరిగి ఇప్పించే విధంగా చర్యలు చేపడతామని వివరించారు.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన ముగ్గురు మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పటోడ గ్రామానికి చెందిన సోయం దత్తు (26) మూడెకరాల్లో పత్తి సాగు చేశాడు. పంట ఎదుగుదల లేక, అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు మంగళవారం రిమ్స్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. అలాగే మహారాష్ట్రలోని చిన్న అర్లికి చెందిన చింతల్వార్ అశ్విన్ (32) మూడెకరాల్లో పత్తి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. దీంతోపాటు బ్యాంక్‌లోనూ రుణం తీసుకున్నాడు. మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 19న పురుగుల మందు తాగాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు.

నిప్పంటుకుని ఒకరు..

మహారాష్ట్రలోని గోండ్వాడికి చెందిన బావునే వైష్ణవి (25) ఈనెల 7న ఇంట్లో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో శరీరం కాలిపోయింది. దీంతో కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమె పుట్టినిల్లు ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాంద గ్రామం కాగా, గత మేలో ఆమెకు వివాహమైంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు.

అర్ధరాత్రి ఆగంతకుడి హంగామా


అర్ధరాత్రి ప్రహరీపై కూర్చున్న ఆగంతకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఓ ఆగంతకుడు హంగామా సృష్టించాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే గంగారాం ఇంట్లో లేకపోగా, ఆ సమయంలో వారిద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి ఓ ఆగంతకుడు ఇంటి తలుపులు తట్టడంతో పాటు ఇటుకలతో కొట్టాడు. 'అంకుల్.. ఆంటీ.. తలుపు తీయండి' అంటూ అరుస్తూ గంటపాటు భయాందోళనకు గురిచేశాడు. దీంతో భయాందోళనకు గురైన ఇద్దరు పిల్లలు 'డయల్ 100'కు పలుసార్లు ఫోన్ చేసినట్లు చెబుతున్నారు. పోలీసులు రాలేదని, దీంతో తాము ఆందోళనకు గురైనట్లు పేర్కొంటున్నారు. కిటికీ తలుపులు తెరవగా, ఓ వ్యక్తి గోడపై కూర్చుండగా అతడి ఫొటోలను ఫోన్‌లో బంధించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయమై మావల పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి వైన్స్‌లో జూన్‌లో చోరీకి పాల్పడి తప్పించుకుతిరుగుతున్న అతీక్‌బుద్ది ఫారూఖీని బుధవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అతీక్‌బుద్ది ఫారూఖీ జూన్ 29న పట్టణంలోని తిర్పెల్లి వైన్స్‌షాప్‌నకు వెళ్లి మద్యం ఇవ్వాలని యజమానిని అడిగాడు. యజమాని డబ్బులు అడిగితే 'నన్నే డబ్బులు అడుగుతావా?' అని బెదిరించి కౌంటర్ నుంచి రూ.3వేలు ఎత్తుకెళ్లి పరారయ్యాడు. దీంతో యజమాని ఫిర్యాదు చేయగా, అప్పట్లో కేసు నమోదు చేశారు. కాగా, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

చీటీల పేరిట మోసగించిన వారి అరెస్ట్

బోథ్: చీటీలు నడుపుతూ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన సిరిపురం రవి, ఉడుత గంగాధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు బోథ్ సీఐ రమేశ్, ఎస్సై రమేశ్ తెలిపారు. గతంలో చీటీలు నడుపుతూ, వారికి ఇవ్వాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.2 కోట్ల మేర చీటీ డబ్బులు చెల్లించినవారికి చెల్లింపులు చేయకుండా కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్నట్లు బాధితులు తెలిపారు. కాగా, బుధవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

గుట్కా పట్టివేత

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన సుభాష్ వద్ద గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. గుట్కా విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సుభాష్‌కు చెందిన దుకాణంలో దాడి చేయగా రూ.28,264 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సుభాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులతో డీఎల్పీవోల చర్చలు

కైలాస్‌నగర్/నార్నూర్: 'పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా బాధ్యులు, ముఖ్య నాయకులతో ఆదిలాబాద్, ఉట్నూర్ డీఎల్పీవోలు ఫణీందర్‌రావు, ప్రభాకర్‌రావు బుధవారం ఉట్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో చర్చలు జరిపారు. నార్నూర్ పంచాయతీ సెక్రటరీ దినేశ్ సస్పెన్షన్‌ను తీవ్రంగా పరిగణించిన పంచాయతీ కార్యదర్శులు ఆందోళనకు సిద్ధమయ్యారు. నార్నూర్ మండలంలోని 16 మంది పంచాయతీ కార్యదర్శులు బుధవారం నుంచి సామూహిక సెలవుపై వెళ్లారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోని కార్యదర్శులు తాము కూడా సెలవులపై వెళ్తామని పేర్కొంటూ ఆయా మండలాల ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. కాగా, దినేశ్‌ను మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వ సంస్థల్లో పారిశుధ్యం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ విధులకు సంబంధించి తమపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని అధికారులను కోరారు. తామెలాంటి సామూహిక సమ్మెకు వెళ్లడంలేదంటూ లిఖితపూర్వకంగా వారికి వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో వివాదం సద్దుమణిగినట్లుగా పంచాయతీ అధికారులు తెలిపారు. అయితే దినేశ్ సస్పెన్షన్‌ను రెండు రోజుల్లోగా ఎత్తివేయాలని అప్పటివరకు మాత్రమే తమ నిరసనలు వాయిదా వేశామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి తెలిపారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయకుంటే సామూహిక సమ్మె తప్పదని వారు స్పష్టం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. చర్చల్లో ఉట్నూర్ ఎంపీవో మహేశ్, గాదిగూడ ఎంపీవో సాయిప్రసాద్, నార్నూర్ ఎంపీడీవో జవహర్ తదితరులు పాల్గొన్నారు.



బాసర : నిర్మల్ జిల్లా బాసరలో గోదావరినది ఒకటో ఘాట్ వద్ద శ్రీజ్ఞాన సరస్వతీ దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం గంగా హారతి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు పండితులు గోదావరికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వేలాది మంది భక్తులు తిలకించి పులకించారు. ప్రతీ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు గంగాహారతి నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

బాసరలో ఢిల్లీ ఆర్కియాలజీ బృందం పూజలు

బాసర : నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారిని ఢిల్లీకి చెందిన ఆర్కియాలజీ బృందం బుధవారం దర్శించుకుంది. ప్రొఫెసర్ మహాలక్ష్మి, రామకృష్ణన్ అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, వైదిక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరికి ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకుడు సంజు పూజారి పూజలు చేయించారు. తర్వాత అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ విశిష్టత, పురాతన చరిత్ర, ఆలయ విశేషాలు, గోదావరి ప్రాశస్త్యం గురించి ఢిల్లీ బృందానికి వివరించారు.

'కళ' తప్పిన కూడలి


నాడు కొయ్య బొమ్మలు, రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడుతున్న చౌరస్తా


నేడు కళావిహీనంగా కనిపిస్తున్న చౌరస్తా


మున్సిపల్ కార్యాలయంలో తొలగించిన బొమ్మలు

నిర్మల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లను లక్షల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. కళాత్మకంగా తీర్చిదిద్దారు. నిర్మల్ సంస్కృతికి అద్దం పట్టేలా కళాకృతులు ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో ఫౌంటేన్ చుట్టూ నిర్మల్ కొయ్య బొమ్మలు, రంగురంగుల లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఫౌంటేన్ ఎత్తుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యకు కారణమైంది. సమస్య పరిష్కారంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ అందమైన జయశంకర్ కూడలి ఎత్తును తగ్గించడానికి ఫౌంటేన్ కూల్చివేశారు. బొమ్మలను తొలగించి మున్సిపల్ కార్యాలయంలోని ఓ మూలన పడేశారు. మూడు నెలలుగా కూడలి కళావిహీనంగా మారింది.

– సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్